క్లుప్తంగా

రక్తదానంతో ప్రాణదానం


రక్తదానం చేస్తున్న ట్రస్ట్ సభ్యులు

సీతమ్మధార: ఆర్ట్ ఆఫ్ లివింగ్ వ్యవస్థాపకుడు గురుదేవ్ రవిశంకర్ జీ 68వ జన్మదినం సందర్భంగా పి.వి.సహాయ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో, లైన్స్ ఇంటర్నేషనల్ బ్లడ్ బ్యాంక్ సహకారంతో సీతమ్మధారలోని సితార ఎన్‌క్లేవ్‌లో రక్తదాన శిబిరం నిర్వహించారు. ట్రస్ట్ సభ్యులు రక్తదానం చేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ రక్తదానంతో ఎంతో మంది ప్రాణాలు కాపాడవచ్చన్నారు. కార్యక్రమంలో ట్రస్ట్ ఫౌండర్ చైర్మన్ పి.వి.వి.ఎస్.మూర్తి, వైస్ చైర్మన్ వి.సాంబశివరావు, లైన్స్ బ్లడ్ బ్యాంక్ చైర్మన్ దుర్గాప్రసాద్, ట్రస్ట్ సభ్యులు పాల్గొన్నారు.

విద్యార్థులకు శిక్షణ


సూర్యనమస్కారాల గురించి పిల్లలకు వివరిస్తున్న ఉపాధ్యాయుడు

తాటిచెట్లపాలెం: మురళీనగర్ మహిళలు, పిల్లల శాఖ గ్రంథాలయంలో వేసవి శిక్షణ శిబిరం ఉత్సాహంగా కొనసాగుతోంది. దీనిలో భాగంగా ఆదివారం పుస్తక పఠనం గురించి గణిత ఉపాధ్యాయుడు ఎం.శంకరరావు పిల్లలకు తెలియజేశారు. సూర్యనమస్కారాలు చేయడం గురించి ఉపాధ్యాయుడు రావు వివరించారు. గ్రంథాలయ అధికారి వై.పద్మజ మాట్లాడుతూ వేసవి సెలవులను సద్వినియోగం చేసుకుంటూ విద్యార్థులు రాణించాలని సూచించారు. అనంతరం పిల్లలకు చాక్లెట్లు, బిస్కట్లు పంపిణీ చేశారు.

ఉచిత ఖత్నా శిబిరం రేపు

తాటిచెట్లపాలెం: సీరత్ కమిటీ ఆధ్వర్యంలో ఈ నెల 16న ఉచిత ఖత్నా(సున్తీ) వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు కమిటీ అధ్యక్షుడు షేక్ అబ్దుల్ లతీఫ్ ఒక ప్రకటనలో తెలిపారు. టీఎస్ఎన్ కాలనీలోని సింకా గ్రాండ్ హోటల్‌లో మంగళవారం ఉదయం 7 గంటల నుంచి ఈ శిబిరం ప్రారంభమవుతుందని, నిష్ణాతులైన వైద్యులు పాల్గొంటారని చెప్పారు. ఈ ఆపరేషన్ చేయించుకున్న వారికి ఉచితంగా మందులు అందిస్తామన్నారు. ఉత్తరాంధ్ర జిల్లాలకు చెందిన ముస్లింలు ఉచిత ఖత్నా శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

19 నుంచి ఎన్టీఆర్ క్రికెట్ టోర్నీ

తాటిచెట్లపాలెం: ఈ నెల 19 నుంచి ఎన్టీఆర్ క్రికెట్ కప్ టోర్నమెంట్ నిర్వహించనున్నట్లు టీడీపీ 50వ వార్డు అధ్యక్షుడు సనపల వరప్రసాద్ తెలిపారు. సుమారు 150 మంది క్రీడాకారులతో డ్రా నిర్వహించి టీమ్‌లు ఏర్పాటు చేశామన్నారు. ఈ నెల 28న ఎన్టీఆర్ జయంతిని పురస్కరించుకుని ఈ పోటీలు నిర్వహిస్తునట్లు చెప్పారు. క్రీడాకారులు, అభిమానులు పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరాకు అంతరాయం రేపు

తాటిచెట్లపాలెం: అక్కయ్యపాలెం పరిధిలో హైటెన్షన్ లైన్ల నిర్వహణలో భాగంగా మంగళవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు జోన్-1 ఈఈ జి.సత్యనారాయణ ఒక ప్రకటనలో తెలిపారు. ఈమేరకు అక్కయ్యపాలెం మెయిన్ రోడ్, అబిద్‌నగర్, షాదీఖానా, రామచంద్రనగర్, కేంద్రీయ విద్యాలయం, రిజిస్ట్రార్ కార్యాలయం, కార్మిక కార్యాలయం ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని, వినియోగదారులు గమనించాలని కోరారు.

నేడు ఏకాదశి పూజలు

దాబాగార్డెన్స్: ఇసుకకొండ(బాబాజీకొండ)పై వెలసిన రమా సహిత సత్యనారాయణ స్వామి ఆలయంలో సోమవారం ఏకాదశి ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు ఆలయ ఈవో బుద్ధ మహాలక్ష్మి నగేష్ తెలిపారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక వ్రతాలు, సామూహిక వ్రతాలు నిర్వహించనున్నట్లు చెప్పారు. భక్తులు పెద్ద ఎత్తున తరలి రావాలని కోరారు.

శ్రీ ఆంజనేయం

- వైభవంగా హనుమజ్జయంతి వేడుకలు
- ఆలయాల్లో భక్తుల విశేష పూజలు

సీతమ్మధార: నియోజకవర్గంలో ఆదివారం హనుమజ్జయంతి వేడుకలు వైభవోపేతంగా జరిగాయి. 14, 24 వార్డుల్లోని ఆంజనేయ స్వామి ఆలయాల్లో భక్తిశ్రద్ధలతో పూజలు చేశారు. గాంధీనగర్ అభయాంజనేయ స్వామి ఆలయంలో భక్తుల నామగోత్రాలతో విశిష్ట పూజలు నిర్వహించారు. మధ్యాహ్నం అన్నసమారాధన జరిపారు. నిర్వాహకుడు నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

- నక్కవానిపాలెం ఉమానీలకంఠేశ్వర స్వామి ఆలయంలో కొలువైన అభయ ఆంజనేయ స్వామికి అర్చకుడు మహేష్ పంచామృతాభిషేకాలు, తమలపాకులు, సింధూరంతో ప్రత్యేక పూజలు చేశారు. భక్తులకు తీర్థప్రసాదాలు అందించారు.
- బాలయ్యశాస్త్రి లేఅవుట్‌లోని అభయాంజనేయ స్వామి ఆలయం, బిలాల్ కాలనీలోని 108 అడుగుల ఎత్తు గల అభయాంజనేయ స్వామి ఆలయంలో విశేష పూజలు నిర్వహించారు. వేకువజాము నుంచి ఆలయం వద్ద భక్తులు పోటెత్తారు.


గాంధీనగర్ ఆలయంలో విశేష అలంకరణలో అభయాంజనేయుడు

అంగరంగ వైభవంగా సీతారాముల కల్యాణం

తాటిచెట్లపాలెం: జాతీయ రహదారి సూర్యానగర్‌లోని యోగసిద్ధాంజనేయ స్వామి ఆలయంలో లోక కల్యాణార్థం సీతారాముల కల్యాణం అంగరంగ వైభవంగా నిర్వహించారు. కేసరినందన మారుతిగా స్వామి భక్తులకు దర్శనమిచ్చారు. జి.శేషాచార్య స్వామి కల్యాణోత్సవానికి చేసిన వ్యాఖ్యానం భక్తులను ఆకట్టుకుంది. ముఖ్య అతిథిగా విచ్చేసిన ఆధ్యాత్మిక ప్రవచన కర్త చాగంటి కోటేశ్వరరావు శ్రీరామనామాన్ని, శ్రీరామ తత్వాన్ని హృదయం నిండా నింపుకున్న ఆంజనేయ స్వామి గురించి ప్రసంగించారు. అనంతరం నారాయణ సేవ నిర్వహించారు. సుమారు 12 వేల మంది అన్నదానంలో పాల్గొన్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు. కార్యక్రమంలో ఆలయ వ్యవస్థాపకులు పెనుమత్స సుబ్బరాజు, యశోద దంపతులు, మాజీ ఎమ్మెల్యే పి.విష్ణుకుమార్‌రాజు, ఆలయ కమిటీ సభ్యులు, ఆధ్యాత్మిక వేత్త ఎం.వి.రాజశేఖర్, సిబ్బంది పాల్గొన్నారు.

- తాటిచెట్లపాలెం సుందర అభయాంజనేయ స్వామి ఆలయంలో ధర్మకర్తలు నడిమింటి సీతారామరావు, రాపేటి గోవింద్, ఆలయ వ్యవస్థాపక అధ్యక్షుడు ఆళ్ల మధుసూదన నరసింగరావు దంపతులు ప్రత్యేక పూజలు చేసి వేడుకలు ప్రారంభించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.
- మాధవధార అభయాంజనేయ స్వామి ఆలయంలో ధర్మకర్త, వైఎస్సార్‌సీపీ నాయకుడు సనపల చంద్రమౌళి ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు, అన్నదానం నిర్వహించారు. సుమారు 3 వేల మంది అన్నదానంలో పాల్గొన్నారని, సాయంత్రం భజన కార్యక్రమాలు నిర్వహించామని నిర్వాహకులు తెలిపారు. వైఎస్సార్‌సీపీ వార్డు అధ్యక్షురాలు పప్పల సునీత, కార్పొరేటర్లు రెయ్యి వెంకటరమణ, వావిలపల్లి ప్రసాద్, టీడీపీ వార్డు అధ్యక్షుడు సనపల వరప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.
- మురళీనగర్ రామాలయంలో కొలువైన దాసాంజనేయ స్వామికి ఆలయ అర్చకుడు రఘురామాచార్యులు చేతుల మీదుగా ప్రత్యేక పూజలు, పంచామృతాభిషేకాలు, సింధూర సహిత తమలపాకులతో సహస్ర నామార్చనలు నిర్వహించారు. ఆలయ ప్రధాన కార్యదర్శి సనపల వరప్రసాద్, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.


మురళీనగర్ రామాలయంలో ఆంజనేయ స్వామికి పూజలు చేస్తున్న అర్చకులు, భక్తులు


సూర్యానగర్ ఆలయంలో సీతారాముల కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు


సూర్యానగర్ యోగసిద్ధాంజనేయ ఆలయంలో ప్రసంగిస్తున్న ప్రవచన కర్త చాగంటి కోటేశ్వరరావు

- పట్టాభిరెడ్డి తోటలోని దాసాంజనేయ స్వామి ఆలయంలో అర్చకుడు ఆరవెల్లి సీతారామాచార్యులు ఆధ్వర్యంలో హనుమజ్జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి.

విశేష అభిషేకాలు

కంచరపాలెం: కంచరపాలెం పరిధి తిక్కవానిపాలెం, కప్పరాడ, రాంజీ ఎస్టేట్, సంజీవయ్య కాలనీ ప్రాంతాల్లోని ఆంజనేయ స్వామి ఆలయాలు భక్తులతో కళకళలాడాయి. వేకువజాము నుంచి స్వామికి అర్చకులు, భక్తులు ప్రత్యేక పూజలు, సింధూరం, తమలపాకులు, పంచామృతాలతో అభిషేకాలు చేశారు. హోమాలు నిర్వహించారు. కప్పరాడ కూడలిలోని ఆంజనేయ స్వామి ఆలయంలో సిమెంటు కార్మికుల సంఘం ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు జరిగాయి.

50, 53 వార్డుల్లో..

మద్రిపాలెం: జీవీఎంసీ 50వ వార్డు మాధవధారలోని అభయ ఆంజనేయ స్వామి దేవాలయంలో ధర్మకర్త సనపల చంద్రమౌళి ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ మహిళా నాయకురాలు పేడాడ రమణికుమారి దంపతులు స్వామిని దర్శించుకున్నారు. ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన అన్నదానంలో ఆమె పాల్గొని భక్తులకు అన్న ప్రసాదం వడ్డించారు. 50, 51 వార్డుల కార్పొరేటర్లు వావిలపల్లి ప్రసాద్, రెయ్యి వెంకటరమణ, విశ్వనాథ రాజు, కీర్తి, పేడాడ నర్సింగ్, లలిత తదితరులు స్వామిని దర్శించుకుని పూజలు చేశారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

- 53వ వార్డు సాయినగర్‌లోని ప్రసన్న ఆంజనేయ స్వామి ఆలయంలో లక్ష తమలపాకులతో పూజ చేశారు. కాశీవిశ్వేశ్వర దేవస్థాన ఉప దేవస్థానమైన ప్రసన్న ఆంజనేయ స్వామికి ఈవో బండారు ప్రసాద్ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామిని దర్శించుకున్నారు.


నక్కవానిపాలెం ఆలయంలో ఆంజనేయుడికి పూజలు చేస్తున్న భక్తులు


మాధవధారలో అన్నదానం చేస్తున్న సనపల చంద్రమౌళి


మాధవధారలో స్వామిని దర్శించుకుంటున్న పేడాడ రమణికుమారి దంపతులు, భక్తులు


కప్పరాడ జంక్షన్, సాయినగర్ ప్రాంతాల్లో ప్రత్యేక అలంకరణల్లో ఆంజనేయ స్వామి

జగన్నాథపురంలో సామాజిక భవనం ప్రారంభం


సామాజిక భవనాన్ని ప్రారంభిస్తున్న నెడ్‌క్యాప్ చైర్మన్ కె.కె.రాజు

తాటిచెట్లపాలెం: జీవీఎంసీ 43వ వార్డు జగన్నాథపురంలో వైజాగ్ సౌండ్ అండ్ లైటింగ్ డెకరేటర్స్ అసోసియేషన్ కోసం సుమారు రూ.13,45,000తో నిర్మించిన నూతన సామాజిక భవనాన్ని ఆదివారం ముఖ్య అతిథి నెడ్‌క్యాప్ చైర్మన్, వైఎస్సార్‌సీపీ ఉత్తర నియోజకవర్గ సమన్వయకర్త కె.కె.రాజు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజలకు సంక్షేమ ఫలాలతోపాటు మౌలిక వసతులు కూడా కల్పిస్తూ వారి జీవన ప్రమాణాలను మెరుగుపరుస్తున్నారని తెలిపారు. స్థానికులకు అందుబాటులో ఉండేలా వార్డుల్లో సామాజిక భవనాలను నిర్మిస్తున్నారన్నారు. కార్యక్రమంలో జీవీఎంసీ ఫ్లోర్ లీడర్ బాణాల శ్రీనివాసరావు, 42, 14 వార్డుల కార్పొరేటర్లు ఆళ్ల లీలావతి శ్రీనివాస్, కె.అనిల్‌కుమార్‌రాజు, జీవీఎంసీ ఈఈ శ్రీనివాస్, ఏఈ రమణమ్మ, సీనియర్ నాయకులు బొడ్డేటి గంగా మహేష్, హబీబ్, మహాదాస్యం గోపి, కె.చిన్నా, దాడి శ్రీను, కాశీప్రసాద్, వైజాగ్ సౌండ్స్ అండ్ లైటింగ్స్ డెకరేటర్స్ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

ఘనంగా దుర్గమాంబ జాతర


అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు

కంచరపాలెం: జీవీఎంసీ 46వ వార్డు తాటిచెట్లపాలెం, కైలాసపురం పరిధి 16 గ్రామాల ఆరాధ్య దేవత దుర్గమాంబ అమ్మవారి జాతర ఉత్సవాలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఉదయం నుంచి అమ్మవారిని భక్తులు దర్శించుకుని పూజలు చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలతో కైలాసపురం రోడ్డు మార్మోగింది. నేషనల్ పోర్ట్ ట్రస్ట్ ఎంప్లాయీస్ యూనియన్ అధ్యక్షుడు, గ్రామ నాయకుడు గొర్లె చందు కుటుంబ సమేతంగా అమ్మవారికి తొలి పూజ చేశారు. మధ్యాహ్నం భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు. సాయంత్రం జరిగిన ప్రధాన జాతరలో సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ఆలయ ధర్మకర్త ఎరిపిల్లి అప్పారావు, ఉత్సవ కమిటీ సభ్యుడు రాజు, దేముడు, రవి, కృష్ణ, శ్రీను ఏర్పాట్లు పర్యవేక్షించారు.

రౌడీ షీటర్లకు కౌన్సెలింగ్

సీతమ్మధార: ఫోర్త్ టౌన్ పోలీస్ స్టేషన్ ఆవరణలో ఆదివారం రౌడీ షీటర్లకు సీఐ శ్రీనివాసరావు కౌన్సెలింగ్ నిర్వహించి, వేలిముద్రలు సేకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేరాల జోలికి పోకుండా సత్ప్రవర్తనతో మెలగాలని రౌడీ షీటర్లకు సూచించారు. గొడవలు, తగాదాల్లో తలదూర్చితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పోలీస్ నిఘా ఎల్లప్పుడూ ఉంటుందని గుర్తించుకుని కుటుంబ సభ్యులతో కలిసి హాయిగా జీవించాలని, మంచిగా నడుచుకోవాలని హితవు పలికారు. పలువురు సిబ్బంది పాల్గొన్నారు.


రౌడీ షీటర్లకు సూచనలిస్తున్న సీఐ శ్రీనివాసరావు

ద్వారకా పీఎస్‌లో..

ద్వారకా జోన్ పోలీస్ స్టేషన్‌లో రౌడీ షీటర్లకు సీఐ సింహాద్రినాయుడు కౌన్సెలింగ్ నిర్వహించారు. ఎటువంటి తగాదాల్లో తలదూర్చినా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. అనంతరం రౌడీ షీటర్లను సిబ్బంది వారి ఇళ్ల వద్ద అప్పగించి వచ్చారు.

బాలిక వైద్యానికి సహకరించండి


కావ్య కుటుంబ సభ్యులకు ఆర్థిక సాయం అందిస్తున్న సీఆర్‌పీఎఫ్ ప్రతినిధులు

సీతమ్మధార: జీబీ సిండ్రోమ్‌తో కొన్నేళ్లుగా మంచానికే పరిమితమైన ద్వారకానగర్‌కు చెందిన చిన్నారి కావ్య చికిత్సకు రాష్ట్ర ప్రభుత్వం, దాతలు చేయూతనిచ్చి సహకరించాలని రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యుడు గొండు సీతారాం కోరారు. చైల్డ్ రైట్స్ ప్రొటెక్షన్ ఫోరం(సీఆర్‌పీఎఫ్) విశాఖ నగర కమిటీ ప్రతినిధులు సమకూర్చిన రూ.15 వేల ఆర్థిక సాయాన్ని ఆదివారం బాలిక ఇంటికి వెళ్లి చిన్నారి తండ్రి హరికుమార్‌కు అందించారు. ఈ సందర్భంగా సీతారాం మాట్లాడుతూ పాప వైద్యం విషయాన్ని ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్తామన్నారు. పట్టా ఫౌండేషన్ పట్టా రమేష్, ఫోరం డాక్టర్ శకుంతల, కె.ఎల్లయ్య, డాక్టర్ ఆదిమూర్తి, హరీష్ తదితరులు పాల్గొన్నారు.

రైతుబజార్ల పరిశుభ్రతకు ప్రాధాన్యం

- మార్కెటింగ్ శాఖ డీడీ యాసిన్
- సీతమ్మధార రైతుబజార్‌లో స్టాళ్లు, ధరల పట్టీల పరిశీలన

సీతమ్మధార: రైతుబజార్లను ఎల్లప్పుడు పరిశుభ్రంగా ఉంచాలని, ఆహ్లాదకరమైన వాతావరణంలో వినియోగదారులు కూరగాయలు కొనుక్కునేలా చూడాలని సిబ్బందికి జిల్లా వ్యవసాయ, వాణిజ్య, మార్కెటింగ్ శాఖ అధికారి షేక్ యాసిన్ సూచించారు. సీతమ్మధార రైతుబజార్‌లో ఆదివారం ఆయన ఆకస్మిక తనిఖీలు చేశారు. ప్రతి స్టాల్ వద్దకు వెళ్లి రైతులు ఐడీ కార్డులు, ధరల పట్టికను పరిశీలించారు. రైతులకు ఇబ్బందులు ఏమైనా ఉన్నాయా అని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా యాసిన్ మాట్లాడుతూ రైతుబజార్‌లో ఎటువంటి అవకతవకలు జరిగినా చర్యలు తప్పవని హెచ్చరించారు. స్టాళ్ల డ్రా తీసేటప్పుడు వచ్చి పరిశీలిస్తానని చెప్పారు. వినియోగదారులతో స్నేహభావంతో మెలగాలని రైతులకు సూచించారు. సమస్యలుంటే తన దృష్టికి తీసుకురావాలని కోరారు. ఆయన వెంట ఎస్టేట్ ఆఫీసర్ కొండబాబు ఉన్నారు.

గేటు వద్ద దుకాణదారులపై ఆగ్రహం

నిత్యం రద్దీగా ఉండే సీతమ్మధారలో రైతుబజార్ గేటుకు ఇరువైపులా రోడ్డుపై తోపుడు బళ్లు నిలిపివేయడంపై మార్కెటింగ్ శాఖ అధికారి షేక్ యాసిన్ ఆగ్రహం వ్యక్తం చేశారు. తోపుడు బళ్లతో ట్రాఫిక్ సమస్య జఠిలంగా మారుతోందని, ఇబ్బంది కలగకుండా ఏర్పాటు చేసుకోవాలని దుకాణదారులకు సూచించారు. లేని పక్షంలో చర్యలు తప్పవని హెచ్చరించారు. వినియోగదారుల వాహనాల పార్కింగ్‌కు స్థలం కల్పించి ఇబ్బందులు లేకుండా చూడాలని సూచించారు.


సీతమ్మధార రైతుబజార్‌లో స్టాళ్లను పరిశీలిస్తున్న మార్కెటింగ్ శాఖ అధికారి షేక్ యాసిన్

సమాచారమ్

అందుబాటులో జోన్-5 అధికారులు

కంచరపాలెం: ప్రజలకు సేవలందించడంలో జీవీఎంసీ జోన్-5 అధికారులు అందుబాటులో ఉన్నారు. జోన్ పరిధిలో ఉత్తర, పశ్చిమ నియోజకవర్గాలకు సంబంధించి 40 నుంచి 63 వరకు మొత్తం 24 వార్డులు ఉన్నాయి. జోన్ ప్రజలు తమ సమస్యల పరిష్కారం, సందేహాల నివృత్తి కోసం అధికారులను వారి ఫోన్ నంబర్లలో సంప్రదించి తెలియజేయవచ్చు. ప్రతి సోమవారం జ్ఞానాపురంలోని జోన్-5 కార్యాలయంలో నిర్వహించే స్పందన కార్యక్రమంలో ప్రజలు నేరుగా అధికారులకు వినతి పత్రాలు అందజేయవచ్చు.


జీవీఎంసీ జోన్-5 కార్యాలయం

జీవీఎంసీ జోన్-5 అధికారుల వివరాలు

అధికారి పేరు	బాధ్యత	ఫోన్ నంబర్
ఆర్.జి.వి.కృష్ణ	జోనల్ కమిషనర్ ప్రథమ అప్పిలేట్ అధికారి	97050 86888
టి.ఎస్.ఎస్.రాజు	సూపరింటెండెంట్-1 పబ్లిఐవో(రెవెన్యూ, ఇంజనీరింగ్, ఎస్టాబ్లిష్‌మెంట్)	99481 25699
ఆర్.వి.రమణ	సూపరింటెండెంట్-2 ఎఐవో(టౌన్ ప్లానింగ్, పబ్లిక్ హెల్త్, యూసీడీ)	99897 84585
ఎ.శ్రీనివాస్	ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ జోన్-ఏ డీమ్డ్ పీఐవో(ఇంజనీరింగ్ విభాగం)	99480 78507
టి.ప్రసన్నరెడ్డి	ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ జోన్-బీ డీమ్డ్ పీఐవో (ఇంజనీరింగ్ విభాగం)	79979 54406
ఆర్.బాబూరావు	రెవెన్యూ కమిషనర్ డీమ్డ్ పీఐవో	88972 10764
ఐ.వి.రమణమూర్తి	అసిస్టెంట్ సిటీ ప్లానర్ డీమ్డ్ పీఐవో(టౌన్ ప్లానింగ్)	81878 99199
ఎం.శ్రీలక్ష్మి	టౌన్ ప్లానింగ్ అధికారి(టీపీవో)	70932 87310
డాక్టర్ ఎ.రాజేష్	పబ్లిక్ హెల్త్ ఏఎంహెచ్‌వో	99480 95520
సూరిశెట్టి శేఖర్	ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ జోన్-బీ డీమ్డ్ పీఐవో (వాటర్ వర్క్స్)	99480 78503
శ్రీనివాస్ వర్మ	డిప్యూటీ ఇంజనీర్ డీమ్డ్ పీఐవో (వాటర్ వర్క్స్)	99123 49448
కె.శైలజ	టీపీఆర్‌వో, ఏపీడీ డీమ్డ్ పీఐవో (యూసీడీ)	97013 85284

భారతీయ సంప్రదాయ సంగీతం అద్భుతం

- డీఆర్‌ఎం అనూప్‌కుమార్ సత్పతి
- ఆకట్టుకున్న డీసీఏ సంగీత్ మేళా

తాటిచెట్లపాలెం: ఈస్ట్ కోస్ట్ రైల్వే వుమెన్స్ వెల్ఫేర్ ఆర్గనైజేషన్(ఈకార్వో) ఆధ్వర్యంలో డివిజనల్ కల్చరల్ అసోసియేషన్(డీసీఏ) ఆదివారం రైల్ గార్డెన్‌లో నిర్వహించిన క్లాసికల్ సంగీత్ మేళా కార్యక్రమం విశేషంగా ఆకట్టుకుంది. ఈ సందర్భంగా డివిజనల్ రైల్వే మేనేజర్ అనూప్‌కుమార్ సత్పతి మాట్లాడుతూ కళాకారుల్లోని కళలను ఇతరులకు తెలియజేసేదిగా ఈ సంగీత కార్యక్రమం ఉందన్నారు. భారతీయ సంప్రదాయ సంగీతం నిర్మలమైనది, అద్భుతమైనదని అభివర్ణించారు. ఇటువంటి సంగీతాన్ని శ్రోతలకు వినిపించడానికి ఈకార్వో, డీసీఏ చేస్తున్న ప్రయత్నాన్ని డీఆర్‌ఎం అభినందించారు. ఈకార్వో ప్రెసిడెంట్ పారిజాత సత్పతి మాట్లాడుతూ ఇటువంటి కార్యక్రమం నిర్వహించడం మొదటిదని, దీని ద్వారా రైల్వే ఉద్యోగులు, సంగీత ప్రేమికులు చాలా ప్రోత్సాహం పొందారని తెలిపారు. వాల్తేర్ డివిజన్ కల్చరల్ అసోసియేషన్‌కు చెందిన గాయకులు జి.వి.సురేష్, కె.వి.సురేష్, రణధీర్‌కుమార్, ఎస్.ఎ.రాజు, ఎం.భారతి, వాయిద్యకారులు యు.శ్రీనివాస్ తదితరులు హిందుస్థానీ, కర్ణాటక, భజన్లను ఆలపించారు. తమ ప్రదర్శనతో శ్రోతలు, సంగీత ప్రేమికులను ఆకట్టుకున్నారు. కార్యక్రమంలో రైల్వే అధికారులు పాల్గొన్నారు.


సంగీత్ మేళాలో పాల్గొన్న డీఆర్‌ఎం అనూప్‌కుమార్ సత్పతి, అధికారులు


డీసీఏ కళాకారులతో ఈకార్వో ప్రెసిడెంట్ పారిజాత సత్పతి

సేవా కార్యక్రమాలతో మాతృ దినోత్సవం

తాటిచెట్లపాలెం: మాధవధార మహిళా వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం అంతర్జాతీయ మాతృ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తల్లిదండ్రులు లేని, అనాథ బాలబాలికలు, పిల్లలు ఉండి పట్టించుకోని తల్లిదండ్రులకు మాతృ హృదయంతో, మానవతా దృక్పథంతో ఆశ్రయం ఇస్తున్న కృపా సాధనా చారిటబుల్ ట్రస్ట్ కార్యదర్శి బి.నవీన్‌కు బియ్యం, పప్పు, గోధుమ పిండి, పంచదార, నూనె వంటి నిత్యావసర సరకులను అందజేశారు. పిల్లలకు దుస్తులు, దుప్పట్లు, ప్లేట్లు అందించారు. అనంతరం ఇళ్లల్లో పనులు చేసుకుంటూ తన పిల్లలను చదివించుకుంటున్న వెంకటేశ్వరి అనే పేద మాతృమూర్తిని శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు శేషమణి, పుష్పలత, పూర్వ అధ్యక్షురాలు కె.మాధవి, ఉపాధ్యక్షులు లీలానాయుడు, రూనీ, కృష్ణవేణి తదితరులు పాల్గొన్నారు.


నవీన్‌కు నిత్యావసర సరకులు అందజేస్తున్న మహిళా వాకర్స్ క్లబ్ ప్రతినిధులు

విమ్స్‌లో పోలీస్ అవుట్ పోస్ట్ ఏర్పాటు

ఆరిలోవ: విశాఖ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్సెస్(విమ్స్)లో పోలీస్ అవుట్ పోస్ట్ ఏర్పాటు చేశారు. ఇందు కోసం ఇక్కడ క్యాజువాలిటీ విభాగంలో ప్రత్యేకంగా ఓ గదిని కేటాయించారు. దీనిని ఆదివారం ద్వారకా ఏసీపీ మూర్తి ప్రారంభించారు. విమ్స్ వైద్యులు, సిబ్బందికి అవుట్ పోస్ట్‌లో ఏరకమైన సేవలు అందుబాటులో ఉంటాయో వివరించారు. ఈ సందర్భంగా ఏసీపీ మాట్లాడుతూ విమ్స్‌లో అవుట్ పోస్ట్ ఏర్పాటు చేయడం వల్ల రోగుల బంధువులు సులువుగా సమాచారం తెలుసుకోవడానికి అవకాశం ఉంటుందన్నారు. క్యాజువాలిటీలో అత్యవసర సమయంలో సత్వరం వైద్యం అందడానికి, ప్రమాద కేసులు నమోదు చేయడానికి వీలు పడుతుందని చెప్పారు. రోగులకు రక్షణ చర్యలతో పాటు వైద్య సేవల్లోను అవుట్ పోస్ట్ ఉపయుక్తంగా నిలుస్తుందన్నారు.